ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 60, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 60, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 31, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నేడు తొలి ఏకాదశి పూజలు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 5.30 గంటలకు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం (108 లీటర్ల పాలతో), లక్ష తులసీ దళములతో విశేష అర్చన, ఫలపుష్ప అలంకరణ జరుగుతాయని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ సురేశ్ కుమార్


ఎస్‌ఐ లింగరాజు

అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఎస్సైలుగా సురేశ్‌కుమార్, లింగరాజు బాధ్యతలు చేపట్టారు. ఈస్ట్‌జోన్‌లోని కాచిగూడ ఎస్‌ఐ సురేశ్ కుమార్, అలాగే సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని కంచన్‌బాగ్‌లో ఎస్‌ఐ లింగరాజు బదిలీపై లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తార్నాక డివిజన్ సీపీఐ సెక్రటరీ నియామకం


సయ్యద్ గౌస్ అలీ

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ సీపీఐ సెక్రటరీగా శాంతినగర్ ఆర్యనగర్‌కు చెందిన సయ్యద్ గౌస్ అలీ నియమితులయ్యారు. ఇటీవల నఫీజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్లో సికింద్రాబాద్ నియోజక వర్గం నాలుగో మహాసభలో సికింద్రాబాద్ అసెంబ్లీ సెక్రటరీ శ్రీనివాస్ గౌస్ అలీకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ అలీ మాట్లాడుతూ.. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక


నూతన అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్‌ను సత్కరిస్తున్న పవన్‌కుమార్ గౌడ్

పద్మారావునగర్: సికింద్రాబాద్ లోని రాణిగంజ్ ఆర్టీసీ డిపో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కోటేశ్వర్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జోనల్ గౌరవ అధ్యక్షుడు జి. పవన్‌కుమార్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. డిపో వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి. పవన్‌కుమార్ గౌడ్ కోటేశ్వర్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిరంజన్, రేణుక, సంపత్‌కుమార్, ఆంజనేయులు, రాజు, నరేశ్‌కుమార్, బాలకిషన్, చంద్రమౌళి, విజయలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని పేర్కొన్నారు. అనంతరం డిపో ఆవరణలో మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు.

బంగారు గొలుసు చోరీ

అమీర్‌పేట: వృద్ధురాలి మెడలోని 55 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన ఎన్.కమల (62) ఈనెల 2న అమీర్‌పేటలోని కనకదుర్గా ఆలయానికి వచ్చింది. పూజలు చేసిన అనంతరం ప్రధాన ద్వారం వద్ద ప్రసాదం కోసం వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మెడలోని గొలుసు కనిపించలేదు. ఇదే విషయాన్ని ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ఇంటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు బాగా జ్వరం రావడంతో గొలుసు చోరీ అయిన రోజు స్టేషన్‌కు రాలేకపోయాయని ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లష్కర్‌లో బోనాలకు సన్నద్ధం..!

సికింద్రాబాద్ నియోజకవర్గంలో 20, 21న నిర్వహణ


చిలకలగూడలోని కట్టమైసమ్మ ఆలయం


మెట్టుగూడలో వరదనీరు తొలగిస్తున్న సిబ్బంది

- భక్తులకు ఇబ్బందుల్లేకుండా అధికారుల చర్యలు
- చెట్ల కొమ్మల తొలగింపు, రహదారుల ఆధునీకరణ,
- డ్రైనేజీ లైన్ల మరమ్మతులు, వరదనీరు వెళ్లేలా పనులు

సికింద్రాబాద్: లష్కర్‌లో అమ్మవారి బోనాల జాతరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 20, 21న బోనాలు వైభవంగా జరగనుండగా, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు 200 కు పైగా ఆలయాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆలయాలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు, వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం రూ. కోటి నిధులను జీహెచ్ఎంసీ అధికారులు వెచ్చిస్తున్నారు. వాటితో పాటు తాగునీటి సదుపాయం, విద్యుద్దీపాల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నారు. ఫలహారం బండ్ల ఊరేగింపులు, ఆలయాల చుట్టూ ఉన్న వృక్షాల కొమ్మలను తొలగిస్తున్నారు.

ఆలయాల ముస్తాబు..

అమ్మవారి ఆలయాల్లో సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల రంగులు వేస్తుండగా మరికొన్ని టెంపుల్లలో ఫ్లోరింగ్, ప్రహరీల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నారు. భక్తుల సౌలభ్యం కోసం బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం, లాలాపేట, తుకారాంగేట్ అమ్మవారి దేవాలయాల వద్ద అభివృద్ధి పనుల కోసం పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

నిధుల కోసం 250 దరఖాస్తులు..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత నగరంలో బోనాల వేడుకలకు ప్రభుత్వం గుర్తింపు లభించింది. ఏటా బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలయాలకు నిధులు కేటాయిస్తున్నది. గతేడాది సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని 210 అమ్మవారి దేవాలయాలకు వేడుకల నిర్వహణకు రూ. 2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది కూడా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు 250 దేవాలయాల నిర్వాహకులు బోనాల వేడుకల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

బోనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయాల వద్ద బోనాలతో వచ్చే మహిళలకు బారికేడ్ల ద్వారా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయాల ప్రాంత రహదారుల మరమ్మతు, ఫుట్‌పాత్‌ల ఆధునీకరణ వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని బోనాల ఏర్పాట్లు చేస్తున్నాం.
– ఎస్ రవికిరణ్, జడ్‌సీ జీహెచ్‌ఎంసీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ


రాంచందర్‌రావుకు అభినందనలు తెలుపుతున్న మాజీ సీఎం నాదెండ్ల, మర్రి శశిధర్‌రెడ్డి


రాంచందర్‌రావుతో మాజీ మేయర్ దంపతులు

సనత్‌నగర్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు, మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలోనూ అధికారమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆ దిశగా అందరిని కలుపుకుని ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఉందని పేర్కొన్నారు.

లాలాపేట: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్. రామ్‌చందర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన తార్నాకలోని తన నివాసం నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో కార్యకర్తలు, నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఓయూలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మేయర్ బండ కార్తీకాచంద్రారెడ్డి, నాయకులు బండ చంద్రారెడ్డి తదితరులు రామ్‌చందర్‌రావును కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వీరన్న, కేదార్, హరి ఉన్నారు.

కంటోన్మెంట్: బీజేపీ లీగల్ సెల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది ఎంవీ సుబ్రహ్మణ్యం రాంచందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాంచందర్ రావుతో పాటు భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు.

బోనాల జాతరకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్: ఈనెల 13,14వ తేదీల్లో జరగనున్న బోనాల జాతరకు పోలీసులకు సహకరించాలని ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ కోరారు. సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం భవనంలో ఫలహార బండ్ల నిర్వాహకులు, షాపులు, ఆలయాల నిర్వాహకులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫలహార బండ్ల ఊరేగింపు త్వరగా మొదలు పెట్టి 12 గంటల్లోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే ఫలహార బండ్లు, తొట్టెల నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే బందోబస్తు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. డీజేలకు అనుమతుల్లేవని ఎవరైనా పెడితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫలహార బండ్ల ఊరేగింపునకు రూట్ మ్యాప్ తయారు చేశామని ప్రతిఒక్కరూ దాన్ని పాటించాలని సూచించారు. షాపుల ముందు క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేస్తారని షాపుల యజమానులు 2 రోజుల పాటు సహకరించాలని ఆమె కోరారు. ప్రతి రూట్‌లో సీసీ కెమెరాలు, పోలీసులు ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీలు సుబ్బయ్య, సైదయ్య, మహంకాళి, మార్కెట్, గోపాలపురం ఇన్‌స్పెక్టర్లు పరశురాం, రాంచందర్, మధుకుమార్ పాల్గొన్నారు.

బోనాల జాతరకు రండి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రం ఇస్తున్న అధికారులు, కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు రావాలని కోరుతూ ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు రామతీర్థ శర్మ, వేదపండితులు వేణుమాధవ శర్మ తదితరులు క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను శనివారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13,14న నిర్వహించనున్న అమ్మవారి బోనాలు, రంగం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవాలని కోరామన్నారు. ఈ సందర్భంగా వారు భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అమ్మవారిని దర్శించుకుని వెళ్లేలా చూడాలని డిప్యూటీ సీఎం, కేంద్రమంత్రి వారిని ఆదేశించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ పద్మారావును ఆయన నివాసంలో కలిసి ఆహ్వానం పలికారు.


డిప్యూటీ సీఎంకు..


ఎమ్మెల్యే పద్మారావుకు..

సమస్యలు పరిష్కరించాలని వినతి



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జీహెచ్‌ఎంసీ బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేశ్ మాట్లాడుతూ.. చాచానెహ్రూనగర్‌లో చెత్తాచెదారాన్ని తొలగించాలని, పద్మారావునగర్ అభినవనగర్ కాలనీ నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు దెబ్బతిన్న రోడ్ల స్థానంలో నూతన రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్, అంగ ముత్తు శ్రీనివాస్, సురేశ్, కృష్ణ, ఎస్. రాజు, శ్రీనివాస్, శీలం శివలింగం, పరమేశ్, పవన్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వాంబే గృహసముదాయంలో కూలిన మెట్లు



లాలాపేట: చంద్రబాబునగర్‌లోని వాంబే గృహ సముదాయంలో శనివారం సాయంత్రం మెట్లు కూలాయి. ఈ ఘటనలో ముజాంబి అనే మహిళ గాయపడింది. శిథిలావస్థకు చేరిన వాంబే గృహాలను పూర్తిగా కూల్చివేసి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ చెప్పారు. కానీ ఆ దిశగా ఎలాంటి ముదండుగు పడలేదు. మళ్లీ ఘటనలు జరగకముందే అధికారులు స్పందించాలని వాంబే గృహవాసులు కోరుతున్నారు.

సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయిస్తూ..

మోసాలకు పాల్పడిన నలుగురిపై కేసు

అమీర్‌పేట: సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకం పేరుతో మోసాలకు దిగి బెదిరింపులకు పాల్పడ్డ నలుగురిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. శివ శంకర్ అనే వ్యక్తి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలో శ్రీ బాలాజీ సెకండ్ హ్యాండ్ కార్స్ పేరుతో కార్లు విక్రయిస్తుంటాడు. గుంటూరుకు చెందిన నందా రూ.7 లక్షలు చెల్లించి స్విఫ్ట్ డిజైర్ కారు కొనుగోలు చేయగా నెల రోజుల తర్వాత కారుపై ఫైనాన్స్ ఉందని, ఈఎంఐలు కట్ట లేదని కారు తీసుకుని వెళ్లారు. దీంతో నందా శివ శంకర్ వద్దకు వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా బెదిరింపులకు దిగాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా సాగర్ అనే వ్యక్తిని మోసం చేశారు. రూ.5.50 లక్షలు చెల్లించి స్విఫ్ట్ డిజైర్ కారు తీసుకోగా కారు తన పేరిట మార్చకుండా మోసం చేయడమే కాకుండా పంజగుట్టలో కొందరు వ్యక్తులు అడ్డుకుని కారు తమ పేరుపై ఉందని కారు తీసుకువెళ్లేందుకు యత్నించారని పేర్కొన్నారు. చివరకు తనపైనే ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కారు తీసుకుపోయారని వాపోయాడు. దీంతో బాధితులు శుక్రవారం పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేయడంతో యజమాని శివ శంకర్‌తో పాటు బెదిరింపులకు పాల్పడ్డ అనిల్, సునీల్, మరొకరిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి ‘చతుర్మాస్-2025’


మాట్లాడుతున్న ప్రతినిధులు

కంటోన్మెంట్: లోక కల్యాణకారి దివ్య సత్సంగ చతుర్మాస్ సమితి ఆధ్వర్యంలో చతుర్మాస్-2025 కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి నిర్వహించనున్నట్లు చతుర్మాస్ సమితి ప్రతినిధులు తెలిపారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన క్రాంతికారి ఔజస్వి ప్రవచనకారుడు గురు లలిత్ గురు ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల కోసం జోధ్‌పూర్ నుంచి లలిత ప్రభుజి తన శిష్య బృందంతో పాదయాత్ర చేస్తూ 1600 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ మైదానంలో ప్రవచనాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జైన సమాజంతో పాటు ఉత్తర భారతీయులంతా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురు లలిత ప్రభు మాట్లాడుతూ.. 2 నెలల పాటు ప్రజలకు సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవచనాలను విభాగాలుగా విభజించి ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.

బోనాలను వైభవంగా నిర్వహించాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: బోనాలను వైభవంగా నిర్వహించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బోనాల నిర్వహణకు సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయం చెక్కులను ఉజ్జయినీ మహంకాళి ఆలయ ప్రాంగణంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 268 దేవాలయాలకు ప్రభుత్వం రూ.1.62 లక్షలు అందించిందన్నారు. ఈనెల 13, 14న జరిగే బోనాలకు లక్షల మంది భక్తులు వస్తారని ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమా మాట్లాడుతూ.. గతంలో కంటే మరింత వైభవంగా బోనాల నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కార్పొరేటర్లు కుర్మ హేమలత, మహేశ్వరి, కొంతం దీపిక, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాస్‌శర్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

‘పోచమ్మ ఆలయ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి’


లాలాపేటలోని పోచమ్మ ఆలయం

సికింద్రాబాద్: తార్నాక డివిజన్ లాలాపేటలోని పోచమ్మ ఆలయ నిధుల దుర్వినియోగం తదితర అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆలయ హక్కుదారు కుమ్మరి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లాలాపేట కుమ్మరిసంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణను 40 ఏళ్లుగా ఇక్కడి 4 కుటుంబాలకు చెందిన వారు చూసుకునేవారన్నారు. ఆరేళ్ల క్రితం మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులకు ఆలయ వ్యవహారాల్లో వంశపారంపర్య హక్కులను హరించి కోటేశ్వర్‌రావు అనే వ్యక్తి ఒక్కడే ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నాడని ఆరోపించారు. అప్పటి నుంచి ఆలయానికి భక్తులు ఇచ్చే విరాళాలు, ఉత్సవాల కోసం ప్రభుత్వం అందించే నిధులను దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై తాము ఎండోమెంట్ అధికారులను ఆశ్రయించగా పూర్వకాలం నుంచి అమలవుతున్న విధంగా 4 కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఆలయ నిర్వహణ చూడాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎండోమెంట్ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న కోటేశ్వర్‌రావుపై చర్యలు తీసుకుని హక్కుదారులైన వారందరికీ ఆలయ బాధ్యతలు ఇవ్వాలని మంత్రి కొండా సురేఖను కోరినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆరెకటిక సంఘం నాయకులు


ఎమ్మెల్సీ కవితకు మద్దతు తెలియజేస్తున్న ఆరెకటిక సంఘం నాయకులు

లాలాపేట: అఖిల భారత ఆరెకటిక సంఘం నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కవిత చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న తలపెట్టిన రైల్‌రోకోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత ఆరెకటిక సంఘం దక్షిణ భారత కన్వీనర్ హింగులేకర్ సంతోష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అతికార్ మల్లేశ్, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ అడేకర్ మల్లికార్జున్, తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ కాంటేకర్ దుర్గాప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు హిరేకర్ నాగేశ్వర్‌రావు, రావులకార్ విద్యాసాగర్, గోగికర్ హర్షిత్ తదితరులు ఉన్నారు.

డెబిట్ కార్డు మార్చి..డబ్బులు కాజేసి..

కేసు నమోదు చేసిన పోలీసులు

సనత్‌నగర్: డెబిట్ కార్డు చోరీ చేసి నగదు కాజేసిన ఆగంతకుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన వి.వెంకటేశ్వరరావు ఈనెల 2న సాయంత్రం నగదు తీసుకునేందుకు భరత్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లాడు. డెబిట్‌కార్డును ఏటీఎంలో పెట్టి పిన్ నెంబర్ ఎంటర్ చేశాడు. నగదు రాకపోవడంతో మరో రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. అయినా డబ్బులు రాకపోవడంతో వెనుకాల ఉన్న వ్యక్తి తాను ప్రయత్నిస్తానని చెప్పి వెంకటేశ్వరరావు వద్ద డెబిట్‌కార్డు తీసుకుని ఏటీఎంలో పెట్టి ప్రయత్నించాడు. నగదు రావడం లేదని చెప్పి కార్డును తిరిగి ఇచ్చి వెళ్లిపోయాడు. వెంకటేశ్వరరావు కూడా ఇంటికి వెళ్లాడు. అతని సెల్‌ఫోన్‌కు మూడు దఫాలుగా మొత్తం రూ.40 వేలు డబ్బు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కంగుతున్న బాధితుడు తన డెబిట్‌కార్డు చూసుకోగా అది తనది కాదని గ్రహించాడు. దీంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాలతో స్థలం కబ్జాకు యత్నం

విశ్రాంత ఆర్మీ అధికారితో పాటు మరొకరి అరెస్టు

రసూల్‌పురా: నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలతో ఖాళీ స్థలం కాజేసేందుకు యత్నించిన ఆర్మీ విశ్రాంత అధికారితో పాటు మరొకరిని కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్ఖాన సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్‌ఫోర్స్‌లో కెప్టెన్‌గా విధులు నిర్వహించిన రామానంద్ జయకర్ గన్‌రాక సొసైటీ ద్వారా 1984లో గన్‌రాక్‌లో (ప్లాట్ నంబర్ 209) 450 గజాల స్థలం కొన్నాడు. ఇతనికి కుమార్తె దివ్య, కుమారుడు విశ్వ అభిలాష్ ఉండగా యూఎస్‌ఏలో ఉంటున్నారు. కాగా 2022 ఆగస్టులో రామానంద్ జయకర్ మృతి చెందాడు. అనంతరం గన్‌రాక్ ఖాళీ స్థలం పార్టీషన్ డీడ్‌లో భాగంగా కుమారుడు విశ్వఅభిలాష్‌కు వాటాగా సంక్రమించింది. ఆ స్థలం పర్యవేక్షణకు గాను అభిలాష్ తన మామా సుధాకర్‌కు జీపీఏ చేశారు.

పథకం ప్రకారం స్థలం కాజేసే యత్నం.

రామానంద్ జయకర్ మృతి చెందినట్లు తెలుసుకున్న పక్కనే ఫ్లాట్ నంబర్ 210లో నివాసం ఉంటున్న విశ్రాంత ఆర్మీ కెప్టెన్ డికె. గిరి (70) స్థలం కాజేసేందుకు తనకు పరిచయం ఉన్న సికింద్రాబాద్ సింధీ కాలనీకి చెందిన అశోక్ రాంచంద్ సంధానీ (59) పేరుపై 2022 ఫిబ్రవరిలో రామానంద్ జయకర్ తన స్థలాన్ని రూ. 2.30 కోట్లకు విక్రయించగా అందులో రూ. 30 లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లు రామానంద్ జయకర్ సంతకం ఫోర్జరీతో డికె. గిరి నకిలీ పత్రాలు సృష్టించాడు. కొద్దిరోజుల అనంతరం సికింద్రాబాద్ 13వ మెట్రోపాలిటన్ కోర్టులో రామానంద్ వారసులు స్థలాన్ని తనకే విక్రయించాలని అశోక్ సంధానీతో పిటిషన్ వేయించాడు. కోర్టు అశోక్ సంధానీకి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇటీవల ఖాళీ స్థలంలో డికె. గిరి నిర్మాణాన్ని ప్రారంభించినట్లు సమాచారం అందుకున్న అభిలాష్ తన స్థలం వద్దకు వెళ్లగా డికె. గిరి నకిలీపత్రాలు చూపించి మిగిలిన రూ.2 కోట్లు తీసుకోవాలని తన వద్ద ఉన్న వెపన్‌తో బెదిరించాడు. దీంతో అభిలాష్ కార్ఖాన పోలీసులకు డికె. గిరి, అశోక్ సంధానీపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కాజేసేందుకు యత్నించినట్లు గుర్తించి డికె. గిరి, అశోక్‌సంధానీ ఇరువురిని శుక్రవారం అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.